

బొక్కలోనిపల్లిలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, ఆగస్టు 9 : ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా గ్రామ దేవత ఆశీర్వాదం ఉండాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ మండలంలోని బొక్కలోనిపల్లిలో పోచమ్మ, నాగులు, బలిపీఠం, పోతురాజు, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి, యుగేందర్‌రెడ్డి, అశోక్, మారుతిగౌడ్ పాల్గొన్నారు.

**ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభం..**

భూత్పూర్, ఆగస్టు 9 : మండలంలోని కప్పెటలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ముందుగా అర్చకులు ప్రారంభ పూజ, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బూడిదపాడులో మొక్క నాటుతున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, ఆగస్టు 9 : పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారమని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండలంలోని డీ-బూడిద్దపాడు శివారులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధించేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి పర్యావరణ పరిరక్షణకు పాటుపడ్డారని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలో వననర్సరీలు ఏర్పాటు చేయడంతోపాటు ట్రాక్టర్, ట్యాంకర్లను మంంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో తిరుపతన్న, బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, గోపాల్, రాఘురెడ్డి, రుక్కూ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..**

ఇటిక్యాల, ఆగస్టు 9 : ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 79మంది లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే విజయుడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. కాగా, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పోటాపోటీగా లబ్ధిదారులకు చెక్కులను అందించేందుకు పోటీపడగా గందరగోళం నెలకొన్నది. దీంతో ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్ సిబ్బందితో వచ్చి అందరినీ బయటకు పంపించారు. అనంతరం 32మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రంగారెడ్డి, తాసీల్దార్లు నరేందర్, ధరణీషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నృత్యం చేస్తున్న చెంచు విద్యార్థులు

## ఆదివాసీల అభ్యున్నతికి కృషి

- చెంచుగూడాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం
- సమిష్టిగా అభివృద్ధి సాధించాలి
- కలెక్టర్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ




కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్

అమ్రాబాద్, ఆగస్టు 9 : ఆదివాసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ చెప్పారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా మండలంలోని మన్ననూర్ గిరిజన భవనంలో ఐటీడీఏ పీవో రోహిత్‌గోపిడి ఆధ్వర్యంలో ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు మన్ననూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెంచులు డప్పులు, నృత్యాలతో గిరిజన భవనం వరకు ర్యాలీ చేపట్టారు. చెంచులక్ష్మి, కొమురంభీం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆదివాసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చెంచులు ఆర్థికంగా ఎదగడానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఆదివాసీ గిరిజనులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలవాలని కలెక్టర్ సూచించారు. చెంచు సంఘాలు సమిష్టిగా ఉంటూ సమస్యలను ఐటీడీఏ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. చెంచుగూడాల్లో రోడ్లు నిర్మించి విద్య, వైద్యం మెరుగైన వసతులు కల్పించేలా పాటుపడుతానని తెలిపారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం వేషధారణతో జీవిత వృత్తాంతాన్ని నృత్యాలతో చెంచులు ప్రదర్శించారు. వివిధ శాఖల్లో పని చేస్తూ ప్రతిభ కనబర్చిన గిరిజన, చెంచు ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి ఫిరంగి, ఆర్డీవో మాధవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్, శిశుసంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి, ఎంపీడీవో మోహన్‌లాల్, చెంచు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగయ్య, నాయకులు శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్, పెద్దిరాజు, శంకరయ్య, అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల చెంచులు పాల్గొన్నారు.

# సాగు సందిగ్ధం

- పూడుకుపోయిన కాల్వలు
- పేరుకుపోయిన జమ్ము
- కొరవడిన ముందుచూపు
- ఆలస్యంగా కాల్వల్లో పూడికతీత పనులు
- సమయానికి అందని నీళ్లు
- అయోమయంలో అన్నదాతలు




వనపర్తి, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ) : నెల రోజులపాటు సమృద్ధిగా వర్షాలు కురిసినా వాటిని ఒడిసిపట్టడంలో అధికారులు, సర్కారు పూర్తిగా విఫలమైంది. దీంతో కాల్వల కింది సాగు ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఎత్తిపోతల పథకాలపై ఆధారపడిన రైతులు అయోమయానికి గురవుతున్నారు. గతేడాదిలో యాసంగిలో నీళ్లు లేక సాగు చేసిన పంటలను ఎండబెట్టుకుని తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుత వానకాలం సీజన్‌లోనూ భరోసాగా సాగు చేసుకుందామంటే కాల్వల్లో నీళ్లు పారడం లేదు. జూరాల కాల్వ కింద మాత్రమే సాగుకు అనుకూలంగా ఉన్నది. కేఎల్ఐ, భీమా ఎత్తిపోతల పథకాల కింద దాదాపు లక్ష ఎకరాలకు పైగా వరి సాగు గతంలో అయ్యేది. అయితే, జూరాల గేట్ల ద్వారా దిగువకు విడుదలైన నీరు శ్రీశైలం, నాగార్జునసాగర్ దాటి సముద్రంలో కలుస్తున్నా.. ఇక్కడి చెరువులకు మాత్రం చుక్క నీరు చేరడం లేదు. కేఎల్ఐ, భీమా-2 ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లాలోని 330 చెరువులకు నీటితో జలకళ రావాల్సి ఉండగా, ఇప్పటికీ వీటిలో పదిశాతం చెరువులకు కూడా నిండలేదు.

**పూడికలతో ఆటంకం..**

కాల్వల్లో నీరు వేగంగా రాకపోవడానికి అనేక కారణాలున్నాయి. వీటిలో ప్రధానంగా అక్కడక్కడా కాల్వలు పూడుకుపోవడం, మరికొన్ని చోట్ల జమ్ముతో సమస్య ఉత్పన్నమవుతున్నది. ఎండాకాలంలో వీటిపై దృష్టి పెట్టాల్సి ఉన్నా అటు అధికారులు గానీ.. ఇటు ప్రజాప్రతినిధులు ఆలోచించలేదు. గత యాసంగిలో సాగునీరు లేక తీవ్ర నష్టాల పాలైన అన్నదాత కష్టాల్లో ఉన్నాడు. ఈ ఏడాదైనా నీటి ఇబ్బంది లేకుండా సాగు చేసుకుందామనుకుంటే అది కూడా అనుమానంగానే మారింది. ఇప్పటి వరకు చాలాచోట్ల నారుమడులు సిద్ధంగా లేవు. మరికొన్ని చోట్ల సిద్ధం చేసుకొని నీరు రాకపోవడంతో నారు ముదిరిపోతుందని ఆందోళన చెందుతున్నారు. కేఎల్ఐ, భీమా ఎత్తిపోతల నీళ్లు వస్తున్నా గతంలో ఊహించినంత వేగంగా రావడం లేదు.

**అంతా అయ్యాక కాల్వల పరిశీలన..**

రైతులంతా సాగునీరు రావడం లేదంటూ ఆందోళనలు చెందుతున్న సమయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆయా పంట కాల్వలను అనుసరించి నీళ్ల రాకపోకలను గమనించారు. పది రోజులైనా డీ-8 ద్వారా పాన్‌గల్ ప్రాంతానికి నీరు రాకపోవడంతో ఇరిగేషన్ అధికారులను మంత్రి వాకబు చేశారు. అలాగే ఎమ్మెల్యే మేఘారెడ్డి నియోజకవర్గంలో పెద్దమందడి బ్రాంచి కెనాల్, ఖిల్లాఘణపురం బ్రాంచి కెనాల్‌ను పరిశీలించారు. చిన్నారెడ్డి డీ-8 కాల్వలను పరిశీలించడం జరిగింది. అయితే, నీళ్లు వేగంగా రాకపోవడంతో కాల్వల పూడికలను తొలగిస్తే వేగంగా వస్తాయని చెప్పడంతో అటువైపు మళ్లారు.

**పూడికతీత పనులు అంతంతే..**

కాల్వల్లో పూడిక పేరుకుపోవడం వల్లే నీరు వేగంగా రావడం లేదని గుర్తించిన మంత్రి, ఎమ్మెల్యే పూడిక తీయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల మంత్రి జూపల్లి కలెక్టరేట్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దీంతో అక్కడక్కడా కొన్ని చోట్ల హిటాచీలను ఏర్పాటు చేసి పూడికల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. పనులు కూడా అనుకున్నంత వేగంగా జరగడం లేదు. పెద్దమందడి బ్రాంచి కెనాల్‌లో గురువారం పూడికతీత పని నడిచింది. సోలీపూర్ నుంచి దాదాపు వీరాయిపల్లి వరకు కొనసాగింది. శుక్రవారం పని నడవలేదని అక్కడి గ్రామాల రైతులు చెబుతున్నారు. అలాగే బీమా-2లోని 16వ ప్యాకేజీలోనూ నత్తనడకన పూడికతీత పనులు సాగుతున్నాయి. పుల్గర్‌చర్ల శివారులో మాత్రమే పూడిక తీత కొనసాగింది. ఇక డీ-8 కెనాల్‌లో పూడిక అలికిడే లేదు. ఇలా మందకొడిగా సాగుతున్న పనులతో ఎప్పుడు సాగునీరు వస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

**రంగసముద్రం గందరగోళం..**

కృష్ణానదిని వరదలు ముంచెత్తుతుంటే.. శ్రీరంగాపురం రిజర్వాయర్ మాత్రం ఇప్పటికీ నిండడం లేదు. నెల రోజుల నుంచి ఏనుకుంట రిజర్వాయర్ ద్వారా రంగసముద్రానికి నీటి విడుదల కొనసాగుతున్నది. 350 క్యూసెక్కుల నీటిని ఈ రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. ఏనుకుంట నుంచి రిజర్వాయర్ వరకు దాదాపు 30కిలోమీటర్ల దూరం ఉంది. దీని పొడవునా 12వేల ఎకరాల ఆయకట్టు ఉంటే, మరో 10వేల వరకు అనధికార సాగుబడులుంటాయి. దీంతో ఈ కాల్వలో వచ్చే నీళన్నీ ఆయకట్టు రైతులే తీసుకుంటున్నారు. కేవలం 100 క్యూసెక్కుల నీరు కూడా రంగసముద్రం రిజర్వాయర్‌కు రావడం లేదు. అందువల్లే నెల రోజులు గడిచినా మూడు మీటర్ల నీరు మాత్రమే రిజర్వాయర్‌లో పెరిగింది. దీంతో 16వ ప్యాకేజీకి నీళ్లు విడుదల చేయాలంటే సరైన నీటి నిల్వ రిజర్వాయర్‌లో ఉండాలి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 320.4 మీటర్ల లెవెల్‌లో నీరుంది. ముందున్న గ్రామాలకు సాగునీరు వేగంగా వెళ్లాలంటే కనీసం రిజర్వాయర్‌లో 322 మీటర్ల వాటర్ లెవెల్ ఉండాలి. ఇక్కడి నుంచి దాదాపు 76 కిలోమీటర్ల 16వ ప్యాకేజీలో కెనాల్ ఉంది. వీటి కింద ఐదు మండలాల గ్రామాలున్నాయి. నీటిమట్టం పెరగాలంటే ఇంకా ఎంత గడువు తీసుకుంటుందో తెలియని పరిస్థితి. ఏనుగుంట నుంచి మరో ప్రత్యేక కెనాల్ ఏర్పాటు చేయడమా లేదా ఉన్న కాల్వను మరింత వెడల్పు చేయాలి. అలా చేయనంత వరకు వర్షాల ప్రభావం అంతంతగా ఉన్నప్పుడు రంగసముద్రం నీటిని నమ్ముకున్న రైతులు నట్టేట మునగాల్సిందే.



శ్రీరంగాపురం-పుల్గర్‌చర్ల గ్రామాల మధ్యలోని భీమా 16 ప్యాకేజీ కాల్వలో తీస్తున్న పూడిక

పదోన్నతులు సరే..

## పర్యవేక్షణేదీ..?

- 77 మండలాల్లో ఉన్నది ఇద్దరే రెగ్యులర్ ఎంఈవోలు
- మండలస్థాయి మొదలు డివిజనల్, జిల్లా స్థాయి వరకు అన్నీ ఖాళీలే..
- ఇన్‌చార్జీలకే పర్యవేక్షణ బాధ్యతలు అప్పగింత



మహబూబ్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన డిప్యూటీ డీఈవో కార్యాలయ భవనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 9 : పాఠశాల విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ మెరుగైన విద్యకు పెద్దపీట వేస్తాం.. ఉమ్మడి పాలమూరు జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు ఉత్తర కుమారుడి ప్రగల్భాలుగానే మిగులుతున్నాయని విద్యావేత్తలు, విశ్లేషకులు పేర్కొంటున్నారు. పాఠశాల విద్యలో మండలస్థాయి మొదలు డివిజన్, జిల్లా ఉన్నత స్థాయి అధికారి వరకు ఎక్కువగా ఖాళీలే ఉండడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చు. ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 77మండలాలు ఉండగా రెగ్యులర్ ఎంఈవోలు ఇద్దరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో విద్యాధికారులు లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతున్నది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించట్లేదనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

**రెండుకు చేరిన ఎంఈవోల సంఖ్య**

జిల్లాల పునర్విభజనకు ముందు పూర్వపు 64 మండలాల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చిన్నచింతకుంట, మక్తల్, ఉట్కూర్, షాద్‌నగర్, తిమ్మాజిపేట, కల్వకుర్తి, పాన్‌గల్, వంగూరు, బల్మూరు మండలాలకు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. అనంతరం గండీడ్ మండలం పాలమూరులో కలపడంతో ఆ మండల ఎంఈవో ఉమ్మడి జిల్లా పరిధిలోకి వచ్చారు. ఇలా మొత్తం ఎంఈవోల సంఖ్య పదికి చేరగా ఒకరు ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం బదిలీలు, పదోన్నతులు, డిప్యూటేషన్లు ఇలా అందరూ స్థాన చలనం కావడంతో ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో ఇద్దరు మాత్ర మే రెగ్యులర్ ఎంఈవోలు మిగిలారు.

**ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్న ప్రభుత్వం**

ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్నత పాఠశాలల్లో పనిచేసే కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, జీహెచ్‌ఎంలకు మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికీ 2 నుంచి 12 మండలాల బాధ్యతలు ఉన్నాయి. ఏకీకృత సర్వీస్ రూల్స్ కేసు ఉండడంతో ఎంఈవోల నియామకం జరగడం లేదు. ఇన్‌చార్జి ఎంఈవోలు పూర్తిస్థాయిలో విధి నిర్వహణ చేయలేకపోతున్నారు. దీంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందని ద్రాక్షగా మారింది. స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, ఉపాధ్యాయుల వేతనాలు, పాఠశాలల పర్యవేక్షణ ఇన్‌చార్జి ఎంఈవోలకు కత్తిమీద సాములాంటిదే. అదే రెగ్యులర్ ఎంఈవోలు ఉంటే ఇంతగా ఇబ్బంది ఉండదు.

**జిల్లా విద్యాశాఖ అధికారులు సైతం..**

ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో రెగ్యులర్ డీఈవోలు ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. అన్ని జిల్లాలకు ఇన్‌చార్జి డీఈవోలే దిక్కయ్యారు. డిప్యూటీ డీఈవో పోస్టులు కనుమరుగయ్యాయి. విద్యాశాఖలో ముఖ్యమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో పాఠశాల విద్యావ్యవస్థ పూర్తిగా కుంటుపడిందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం జిల్లాలకు కొత్త పోస్టుల ఊసే ఎత్తడం లేదు. మహబూబ్‌నగర్ డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకులు రవీందర్ మహబూబ్‌నగర్ జిల్లా డీఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తుండగా.. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు నాగర్‌కర్నూల్, వనపర్తి ఇన్‌చార్జి డీఈవోగా కొనసాగుతున్నారు. సిద్దిపేట అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్‌గనీ నారాయణపేట జిల్లాకు, హైదరాబాద్ బాలభవన్ ఏడీ ఇందిర జోగుళాంబ గద్వాల జిల్లాకు ఇన్‌చార్జి డీఈవోలుగా వ్యవహరిస్తున్నారు. డైట్, బీఈడీ కళాశాలల్లో పాఠాలు చెప్పాల్సిన అధ్యాపకులు ఇతర జిల్లాల్లో పర్యవేక్షణ, పరిపాలన చేస్తూ.. భావి గురువులకు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

### ఎంఈవోల బదిలీలు ఇలా..

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| లక్ష్మణ్‌సింగ్ | సీసీకుంట | మహబూబ్‌నగర్ |
| శంకర్ | వంగూరు | కల్వకుర్తి |
| వెంకటయ్య | గండీడ్ | షేర్‌లింగంపల్లి |
| రామారావు | బల్మూరు | ఉప్పల్ |
| లక్ష్మణ్‌నాయక్ | పాన్‌గల్ | శంషాబాద్ |
| బాసునాయక్ | కల్వకుర్తి | సరూర్‌నగర్ |
| శ్రీను | తిమ్మాజిపేట | హయ్యత్‌నగర్ |
| శంకర్‌రాథోడ్ | షాద్‌నగర్ | రాజేంద్రనగర్ |
| హరిశ్చందర్ | దోమ | మల్కాజ్‌గిరి |

## ఇన్‌చార్జీలతోనే ఇంటర్ విద్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 9 : మహబూబ్‌నగర్ జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిగా గంగిశెట్టి ఉమామహేశ్వర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డీఐఈవోగా పనిచేసిన శ్రీధర్‌సుమన్ వరంగల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జడ్చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్) ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఉమామహేశ్వర్‌కు రాష్ట్ర ఇంటర్ విద్యాశాఖ అధికారులు బాధ్యతలు కేటాయించారు.

**ఐదు జిల్లాలకు ఇన్‌చార్జీలే..**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఒక్కరంటే ఒక్కరు కూడా రెగ్యులర్ డీఐఈవోలు లేకపోవడం విశేషం. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ డీఐఈవో ఉమామహేశ్వర్, నాగర్‌కర్నూల్-వెంకటరమణ, నారాయణపేట-సుదర్శన్, వనపర్తి-అంజయ్య, జోగుళాంబ గద్వాల - హృదయ్‌రాజ్ మొత్తం ఐదుగురు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు కావడం గమనార్హం. వీరంతా నాన్‌సాంక్షన్ పోస్టుల్లోనే జిల్లా ఇంటర్ విద్యాధికారులుగా కొనసాగుతుండటం కొసమెరుపు.

**వనపర్తి డీఐఈవోగా అంజయ్య..**

వనపర్తి జిల్లా డీఐఈవోగా అంజయ్య బాధ్యతలు చేపట్టారు. గతంలో వనపర్తి డీఐఈవోగా కొనసాగిన రాధ జడ్చర్ల బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ కాగా, ఆమె స్థానంలో గోపాల్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అంజయ్య వనపర్తి ఇన్‌చార్జి డీఐఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.



మహబూబ్‌నగర్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం

## న్యాయవాదులపై దాడులు సహించం

- సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 9 : న్యాయవాదులపై దాడి చేస్తే వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కోర్టు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. జనగామ ఘటనపై ప్రభుత్వం స్పందించి పోలీసులపై కేసు నమోదు చేసి సస్పెండ్‌తోపాటు బదిలీ కూడా చేశారన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథ్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు వీరబ్రహ్మాచారి, అనంతరెడ్డి, చంద్రమౌళి, జాకీర్, ఉమామహేశ్వరి, సబిత, సామిల్, జగన్, శివకుమార్, మల్లికార్జున్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

## రాత్రికి రాత్రే సీల్ తొలగించారు..!

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 9 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రెండు చౌకధర దుకాణాలకు సీల్ వేసిన విషయంలో సంబంధిత అధికారులు ఆగమేఘాలపై స్పందించడం అనుమానాలకు తావిస్తోంది. గురువారం తాము పిలిస్తే డీలర్లు రాలేదన్న అధికారులు.. శుక్రవారం ఉదయం 6గంటలకే ఆయా దుకాణాలకు వేసిన సీల్ తొలగించడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. దీని వెనక నాయకులు పెద్ద వ్యవహారమే నడిపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌ను సంప్రదించగా.. రెండు దుకాణాల డీలర్లు షాద్‌నగర్‌లో పెళ్లిలో ఉన్నామని చెప్పారని, తర్వాత వారు రావడంతో డీటీలు వెళ్లి తనిఖీలు చేయగా వేరియేషన్ ఏమీ లేదని తేల్చారని తెలిపారు. జిల్లాలోని చౌకధర దుకాణాల్లో ఈ నెలలో ఇప్పటి వరకు ఏ కేసులు నమోదు కాలేదన్నారు. పౌరసరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల డ్యూటీ సమయానికి అనుగుణంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



శుక్రవారం దుకాణానికి తొలగించిన సీల్

## హత్య కేసులో పదిమందికి రిమాండ్

మూసాపేట, ఆగస్టు 9 : అడ్డాకుల మండలంలోని కాటవరంలో ఈ నెల 6వ తేదీన జరిగిన కొల్లం పల్లి(40)హత్య కేసుకు సంబంధించి 10మంది నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు భూత్పూర్ సీఐ రామకృష్ణ తెలిపారు. దాడికి పాల్పడిన వారిలో కాటవరం గ్రామానికి చెందిన మన్యంకొండ, కిరణ్ కుమార్, నాగరాజు, అలాగే భూత్పూర్ మండలం తాటిపర్తికి చెందిన రఘునందన్, మద్ద శివకుమార్, దొంగలి రాజేశ్, మహబూబ్‌నగర్ మండలం ఓబులాయిపల్లికి చెందిన గొల్ల కురుమూర్తి, మన్యంకొండకు చెందిన అప్పన్నపల్లి ఆంజనేయులు, కోటకదిరకు చెందిన రాజు, అడ్డాకుల మండలం కాటవరం గ్రామానికి చెందిన అంజిలమ్మను అరెస్ట్ చేసి మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు వెల్లడించారు.